ఈనాడు సంగారెడ్డి

గురువారం అక్టోబరు 24, 2024

చెరకుకు మద్దతు ధర చెల్లించండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి తదితరులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: చెరకు మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి గణపతి చక్కెర కర్మాగార యాజమాన్యానికి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో రైతు సంఘాలు, గణపతి చక్కెర కర్మాగార యాజమాన్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా రైతులు టన్నుకు రూ.4500 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యాజమాన్యాలు అన్నదాతలకు సహకారం అందించాలని కోరారు. చెరకు కోత, రవాణా సౌకర్యాలను యాజమాన్యం ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. మద్దతు ధర పెంపు విషయంలో వారం రోజులు గడువు ఇవ్వాలని పరిశ్రమ సీఈవో యుగంధర్, జీఎం కృష్ణమోహన్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, అసిస్టెంట్ కేన్ కమిషనర్ రాజశేఖర్, సీడీసీ ఛైర్మన్ గడీల రాంరెడ్డి, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమృత్ పథకంపై సమీక్ష

ఈనాడు కథనానికి స్పందన

జహీరాబాద్, న్యూస్‌టుడే: జహీరాబాద్ పట్టణంలో రూ.66 కోట్లతో అమలుకు తలపెట్టిన అమృత్ పథకంపై బుధవారం అధికారులు సమీక్ష నిర్వహించారు. 'అమృత్ పథకం.. ఆమడ దూరం' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ ఈఈ తిరుమలరావు, డీఈఈ కృష్ణమోహన్, ఏఈ భరత్, పురపాలక కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ దీప్‌చంద్ పురపాలక కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం రాయికోడ్ మండలం ఇటికెపల్లి శివారులోని మంజీరా నదిలో నిరుపయోగంగా ఉన్న సంప్, పంప్‌హౌస్‌లను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేసి తదుపరి కార్యాచరణ సిద్ధం చేస్తామని అధికారులు వివరించారు.

హత్నూర పీహెచ్‌సీలో.. రెండేళ్లుగా నిలిచిన ప్రసవాలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

న్యూస్‌టుడే, హత్నూర: మండల కేంద్రమైన హత్నూరలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రంలో గతంలో ప్రసవాలకు(24 గంటలు) సేవలు అందించేవారు. సిబ్బంది కొరత ఉందనే కారణంతో రెండేళ్లుగా ఈ సేవలు నిలిపివేశారు. దీంతో గర్భిణులు సంగారెడ్డిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సేవలు కొనసాగించేలా చూడాలని పలువురు కోరుతున్నారు. హత్నూర పీహెచ్‌సీ మండలంలోని గర్భిణులే కాకుండా పొరుగు మండలాల నుంచి వచ్చేవారు. ఇక్కడి వైద్యులు నిత్యం పదుల సంఖ్యలో ప్రసవాలు చేసేవారు. ఇటీవల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పీహెచ్‌సీ సందర్శనకు రాగా.. పలువురు గర్భిణులు ఇక్కడి సమస్యను ఆమెకు వివరించారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత: పీహెచ్‌సీలో అరకొర సిబ్బంది ఉండటంతో.. ఉన్నవారిపైనే భారం పడుతోంది. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండాలి. వీరిలో ఒకరు ఏడాది క్రితం కొండాపూర్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. మరొకరే విధులు నిర్వహిస్తున్నారు. మూడు ఏఎన్ఎం పోస్టులకు ఖాళీగా ఉన్నాయి. ముగ్గురు స్టాఫ్ నర్సులకు ఒక్కరే సేవలు అందిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. మహిళా ఆరోగ్యకార్యకర్తలు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. సిబ్బంది కొరత వైద్య సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారిణి గాయత్రీదేవి దృష్టికి తీసుకెళ్లగా.. సమస్య మా దృష్టికి వచ్చింది.. వెంటనే ప్రసవాలు చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

తుది పనుల్లో.. తీవ్ర జాప్యం

జిల్లా వైద్య కళాశాల నిర్మాణాల తీరిది..

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల పనులు నెమ్మదించాయి. తుది దశ పనులు పూర్తి చేసే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో గుత్తేదారు చేతులెత్తేశారనే విమర్శలున్నాయి. మూడో బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల ఇటీవల కళాశాలలో చేరారు. వచ్చే నెలలో ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభించాలని వైద్యారోగ్యశాఖ ఆదేశించింది. సరిపడా పక్కా భవనాలు లేకపోవడం, అద్దె గదుల్లో వసతి గృహాల నిర్వహణతో విద్యార్థుల కష్టాలు రెట్టింపవుతున్నాయి. ఇకనైనా అధికారులు దృష్టి సారించి తుది దశ పనులు వెంటనే పూర్తయ్యేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

తరచూ గడువు పొడిగింపు

2022 జులైలో జిల్లాకు వైద్య కళాశాల మంజూరయింది. సంగారెడ్డిలో వెంటనే భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదే ఏడాది అక్టోబరు 31వ తేదీలోపు పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. జాప్యం చోటుచేసుకుంది. 2023 జూన్‌లోగా పనులు పూర్తి చేస్తామని గుత్తేదారు ఆర్అండ్‌బీ అధికారులకు అర్జీ పెట్టుకోగా.. వారు అనుమతించారు. ఆ గడువు ముగిసేనాటికి పనులు పూర్తి చేయలేదు. మళ్లీ ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గడువు కోరగా.. అధికారులు మంజూరు చేశారు. ప్రస్తుతం వైద్య కళాశాల భవనాల పనులు తుది దశకు చేరాయి. గదుల్లో విద్యుత్తు తీగలు, ఫ్యాన్ల ఏర్పాటు, రంగులు వేయడం, శౌచాలయాలు, సీలింగ్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. సకాలంలో బిల్లులు మంజూరు చేస్తే.. అసంపూర్తి పనులు పూర్తి చేయడానికి మరో మూడు, నాలుగు నెలలైనా పడుతుంది. అప్పటి వరకు విద్యార్థులు అద్దె భవనాల్లో ఇబ్బందులు పడాల్సిందే.



వైద్య కళాశాల నూతన భవనం

బిల్లుల బకాయిలు ఇలా (రూ.కోట్లలో)

మంజూరైన నిధులు:	142
గుత్తేదారుకు బకాయిలు:	50.62
ఇప్పటి వరకు చెల్లింపులు:	46.68

అద్దెలతో ఆర్థిక భారం

ఇప్పటి వరకు రెండు బ్యాచ్‌ల ఎంబీబీఎస్ విద్యార్థులు 300 మంది విద్య అభ్యసిస్తున్నారు. ఇటీవల మూడో బ్యాచ్ సంబంధించి మరో 150 మంది ప్రథమ సంవత్సరంలో చేరారు. వీరికి వసతి కోసం విద్యానగర్ కాలనీలో అద్దె భవనం, జిల్లా వైద్యారోగ్యశాఖ పాత కార్యాలయాల భవనాలు ఎంపిక చేశారు. వీటిలో విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు లేవు. వసతుల కల్పనకు జిల్లా కలెక్టర్ ఇటీవల రూ.10లక్షలు మంజూరు చేశారు. మూడేళ్లుగా అద్దె భవనాల వల్ల ప్రభుత్వంపై రూ.లక్షల్లో ఆర్థిక భారం పడింది.

అద్దె భవనాల్లో విద్యార్థులకు వసతి

వైద్య కళాశాల భవనాల పనులు ఇంకా పూర్తి కాలేదు. తరగతుల నిర్వహణకు ఎలాంటి సమస్య లేదు. విద్యార్థుల వసతి గృహాలకు ఇబ్బందిగా ఉంది. నవంబరులో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభించాలని నిర్ణయించాం. -దేవర సుధామాధురి, వైద్య కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్.

త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం

జిల్లా వైద్య కళాశాల భవనాల పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పనులు తుది దశకు చేరాయి. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయగానే గుత్తేదారుకు చెల్లిస్తాం.

-రాంబాబు, ఆర్అండ్‌బీ ఈఈ.

సైబర్ బాధితులకు పోలీసుల అండ: ఎస్పీ



డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సైబర్ బాధితులకు పోలీసు శాఖ అండగా నిలుస్తోందని ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ విభాగం డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. హత్నూరకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి రెండేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో పరిచయమైన అపరిచిత వ్యక్తి మాటలు నమ్మి రూ.30 లక్షలు జమ చేసి మోసపోయారన్నారు. ఆ తర్వాత బాధితుడు ఫిర్యాదు చేయగా.. సైబర్ విభాగం పోలీసులు రూ.12.5 లక్షలను బ్యాంకు ఖాతాలో హోల్డింగ్ చేయించారన్నారు. ఆ నగదును బాధితుడికి రిఫండ్ చేసేలా చొరవ చూపినట్లు పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురయితే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

దారిని కమ్మేసిన పొగమంచు



గుమ్మడిదల టోల్‌గేట్‌కు సమీపంలో..

జిల్లాలో బుధవారం తెల్లవారు జామున దట్టమైన పొగమంచు కురిసింది. ఉదయం 8 గంటల వరకు అలాగే కొనసాగడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకొని జాగ్రత్తగా వెళ్లాల్సి వచ్చింది. -న్యూస్‌టుడే, గుమ్మడిదల, నారాయణఖేడ్.

మట్టి దందాకు అడ్డుకట్టేది?



సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లో పలుచోట్ల ఖాళీ స్థలాలు మట్టి, మొరం గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టి ఇక్కడ నిల్వచేస్తున్నారు. ఇంటి నిర్మాణాలు, ఇటుక బట్టీలు, వెంచర్లకు విక్రయిస్తూ రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. వాల్టా చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడని తీరుపై విమర్శలొస్తున్నాయి. -న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.

పిల్లల భవిత.. తల్లిదండ్రుల బాధ్యత

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట

అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం

విద్యార్థులు ఇంటి వద్ద చరవాణి, కంప్యూటర్, టీవీలకు అధిక సమయం కేటాయిస్తున్నారు. దీంతో చదువు కుంటుపడుతున్నారు. మార్కులు తక్కువగా వస్తుండటంతో విద్యాశాఖ ప్రత్యేక సర్వే నిర్వహించింది. విద్యార్థులను పుస్తక పఠనం వైపు మళ్లించేందుకు ఈ నెల 19న నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల(పీటీఎం) సమావేశాల్లో ప్రత్యేక తీర్మానాలు చేశారు. ఇంటివద్ద విద్యార్థులు ఎక్కువ సమయం చదువుకు కేటాయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు

విభాగం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	861	55,210
ప్రాథమికోన్నత	181	22.124
ఉన్నత	203	45,126

ప్రత్యేక చొరవ అవసరం

పిల్లలు పాఠశాలల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. చరవాణి, టీవీలు చూడటానికి ఎక్కువ సమయం కేటాయించవద్దని అవగాహన కల్పించాలి. విద్య ప్రాధాన్యాన్ని వివరించాలి. ఎప్పటికప్పుడు హోంవర్కు పూర్తిచేయడంతో పాటు.. బడిలో చెప్పిన పాఠాలు ఇంటివద్ద చదువుకోవాలి. బడిలో పాఠశాలలో ఇచ్చిన ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా తల్లిదండ్రులు సహకరించాలి.

పర్యవేక్షణ కీలకం..

ఇంటి వద్ద విద్యార్థులు ఎలా చదువుతున్నారో ఉపాధ్యాయులు కూడా పర్యవేక్షించాలి. ప్రత్యక్షంగా.. లేదా చరవాణి ద్వారా విద్యార్థుల చదువుపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. ఇంటి వద్ద ఉన్న వాతావరణంపై పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులను అడిగి తెలుసుకోవాలి. పిల్లలను చరవాణికి దూరం చేసి పుస్తక పఠనంపై దృష్టిసారించేలా చేయడమే కార్యక్రమ ఉద్దేశం. ప్రత్యేక కార్యక్రమానికి తల్లిదండ్రులు సహకారం అందించాలని సమగ్ర శిక్షా సీఎంవో వెంకటేశం తెలిపారు.

టీఎస్ఈఈయూ నూతన కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-327(టీఎస్ఈఈయూ) సంగారెడ్డి సర్కిల్ నూతన కార్యవర్గాన్ని బుధవారం సంఘం భవనంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జేపీఏ శ్రీదేవి, మంజులు వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీకర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వినోద్‌కుమార్, కోశాధికారిగా వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

ఆలయాలను పరిరక్షించాలని నిరసన



జహీరాబాద్‌లో ర్యాలీ..

జహీరాబాద్, నారాయణఖేడ్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆలయాలపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొంటూ బుధవారం జహీరాబాద్, నారాయణఖేడ్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జహీరాబాద్‌లో వ్యాపారులు దుకాణాలను స్వచ్ఛందంగా మూసేశారు. హిందూ సంఘాల ప్రతినిధులు, భజనా శ్రేణులు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్‌లో బంద్ నిర్వహించారు. మంగల్‌పేట దుర్గా భవానీమాత ఆలయం నుంచి ఖేడ్ పట్టణంలోని రాజీవ్‌చౌక్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి కూడలిలో ధర్నా చేపట్టారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మందపైకి దూసుకొచ్చిన టిప్పర్ 19 మేకపిల్లల మృత్యువాత

జోగిపేట న్యూస్‌టుడే: ఆందోలు మండలం సంగుపేట శివారులో 161వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం మేకల మందపైకి టిప్పర్ దూసుకెళ్లింది. ఈ ఘటనలో 19 మేక పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. పలు జీవాలకు గాయాలయ్యాయి. నారాయణఖేడ్ జిల్లా నుంచి సంగారెడ్డి జిల్లా సంగుపేటకు మేకల మంద వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతి చెందిన మేక పిల్లల విలువ సుమారు రూ.80 వేల ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి పరిహారం చెల్లించాలని కాపరులు కోరారు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

శునకాల దాడిలో 12 గొర్రెలు..

గుమ్మడిదల, న్యూస్‌టుడే: శునకాల దాడిలో గొర్రెలు మృతిచెందాయి. గుమ్మడిదలకు చెందిన రైతు కృష్ణ మంగళవారం రాత్రి ఇంటి సమీపంలోని కొట్టంలో గొర్రెలు ఉంచారు. బుధవారం ఉదయం వచ్చి చూసే సరికి మంద లోని 12 గొర్రెలు మృతి చెందడం చూసి బోరున విలపించారు. గుమ్మడిదల పశు వైద్యాధికారి అరుణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుక్కల బారిన పడి మరణిస్తున్న గొర్రెలకు ఇంజెక్షన్లు వేశారు. సీజీఆర్ ట్రస్టు ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి బాధిత రైతుకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఆర్ఎంపీ క్లినిక్‌లపై విచారణ

హత్నూర, న్యూస్‌టుడే: మండలంలోని దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి రెడ్డిఖానాపూర్, కాసాల, దౌల్తాబాద్, సిరిపురం, లక్ష్మాపూర్, మల్కాపూర్, బోర్పట్ల, గుండ్లమాచునూర్, చందాపూర్ గ్రామాల్లో అనుమతులు లేకుండా కొనసాగుతున్న 22 ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై విచారణ చేపట్టినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు దివ్యజ్యోతి తెలిపారు. జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు.

భూసేకరణ సర్వే అడ్డగింత



సర్వేకు వచ్చిన అధికారులు

జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్: న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ కోసం భూసేకరణ ప్రతిపాదిత భూముల్లో సర్వే చేస్తున్న జియోలాజికల్ సర్వే బృందాన్ని రైతులు అడ్డుకున్నారు. డప్పూర్, మల్గి, వడ్డి గ్రామ శివారుల్లోని భూముల వద్దకు బుధవారం అధికారులు రాగా.. రైతులు అక్కడికి చేరుకొని నిరసన తెలిపారు. దీంతో సర్వే బృందం సభ్యులు అక్కడి నుంచి వెనుతిరిగారు.

మరోచోట భూమి కేటాయించాలి: నిమ్జ్‌కు సేకరిస్తున్న భూమికి సమానంగా మరోచోట భూమి కేటాయించాలని రైతులు డిమాండ్ చేశారు. న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్‌లో బుధవారం భూసేకరణ నిమిత్తం నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వర్, న్యాల్‌కల్ తహసీల్దార్ భూపాల్, జహీరాబాద్ ఆర్డీవో రాజు రైతులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో మరో 149 ఎకరాల పట్టా భూమి సేకరిస్తున్నట్లు రైతులకు వివరించారు. భూములు ఇచ్చేందుకు సిద్ధమేనని మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని, లేదంటే మరోచోట భూమి కేటాయించాలని కోరారు.

పట్టు రైతులకు ప్రోత్సాహం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: పట్టు పరిశ్రమ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ప్రోత్సాహకాలు అందిస్తోందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వరరావు అన్నారు. ఝరాసంగం మండలం మొగుడంపల్లి గ్రామంలో బుధవారం పర్యటించి మల్బరీతోటల సాగు పరిశీలించారు. షెడ్ల నిర్మాణం మొదలుకొని మల్బరీ సాగు, పట్టు పురుగుల కొనుగోలు, ఉత్పత్తి వరకు అన్నింటికీ రాయితీలు ఇస్తున్నామన్నారు. ఔత్సాహిక రైతులు ముందుకొస్తే మరిన్ని యూనిట్లు మంజూరు చేసేందుకు సిద్ధమన్నారు.

నేడు మంత్రి దామోదర్ పర్యటన

హత్నూర, న్యూస్‌టుడే: మండల పరిధి దౌల్తాబాద్‌కు గురువారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రానున్నారని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు దివ్యజ్యోతి తెలిపారు. దౌల్తాబాద్‌లో కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఆయన ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

కుంటలు మింగేస్తున్న క్వారీలు

మాదారం పరిధిలో యథేచ్ఛగా ఆక్రమణలు

న్యూస్‌టుడే, జిన్నారం: ఓ వైపు చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంటే.. మరోవైపు క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు ఆక్రమణలకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని మరికొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. జిన్నారం మండలం మాదారం శివారు సర్వే నంబరు 210లోని రెండు కుంటలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను ఇప్పటికే నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవించినా.. వారి నుంచి ఎలాంటి స్పందన లేదని గ్రామస్థులు చెబుతున్నారు. నగరానికి అత్యంత చేరువలో ఉన్న కుంటలు వరదనీరు కాకుండా జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



దామరకుంటను మట్టితో పూడ్చుతున్న తీరు..

తవ్వకాలతో వెలువడిన మట్టితో..

జిన్నారం మండలం మాదారం శివారులో దామరకుంట ఉంది. దీని కట్ట పరిధి అమీన్‌పూర్ మండలం బొమ్మకుంట కిందకు రాగా.. కుంట శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ జిన్నారం మండలం మాదారం పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం క్వారీల్లో తవ్వకాల వల్ల వెలువడిన మట్టితో చెరువు ఎఫ్‌టీఎల్‌ను పూడ్చి వేస్తున్నారు. ఇప్పటికే 5 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురయిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. బఫర్ జోన్ కనిపించకుండా పోయింది. ఈ కుంట కింద గతంలో 15 ఎకరాల వరకు ఆయకట్టు ఉన్నప్పటికీ.. ఆ ప్రాంతం ప్రస్తుతం క్వారీలు, క్రషర్లతో నిండిపోయింది. జిన్నారం మండల పరిధిలోని కొకలోనికుంటలో ఇదే పరిస్థితి. ఐదు క్వారీలకు సంబంధించిన మట్టితో పూడ్చేస్తున్నారు. నిబంధనల ప్రకారం క్వారీల యాజమాన్యాలు రాళ్లను తీయగా వెలువడిన మట్టిని కేటాయించిన స్థలంలో నిల్వ చేయాలి. చెరువులు, కుంటలు, వాగుల్లో వేయవద్దు. క్వారీ గడువు ముగిసిన తర్వాత ఆ మట్టితో గుంతలు పూడ్చాలి.

అధికారులకు ఫిర్యాదు చేశాం

మాదారం శివారులోని కుంటలను పూడ్చివేస్తున్నట్లు జిల్లా అధికారులతో పాటు పటాన్‌చెరులోని నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాం. చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చిన అధికారులు.. అటువైపు కన్నెత్తి చూడటం లేదు. జల వనరులు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. ఇకనైనా కుంటలు పరిరక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. -సురేందర్‌గౌడ్, మాజీ సర్పంచి, మాదారం.

మా దృష్టికి రాలేదు

మాదారం శివారులోని కంకర క్రషర్ల వద్ద ఉన్న రెండు కుంటలు పూడ్చి వేస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాం. కుంటల పరిరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. - ప్రసాద్, ఏఈ, నీటిపారుదల శాఖ, జిన్నారం.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చేర్యాల విద్యార్థి



చేర్యాల, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాల్లో భాగంగా 19 ఏళ్లలోపు విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కర్రోల వరుణ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన వరుణ్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నాడని, త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపక బృందం అభినందించి సన్మానించారు.

హాకీ పోటీలకు ఎంపిక



సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి హాకీ అండర్-14, 17 పోటీలకు మల్కాపూర్ శివారులోని ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14లో సోను, మహిర తంజీన్, చందన, ఇజ్రాయిల్, మహ్మద్ తకీఖాన్.. అండర్-17 పోటీలకు రిత్విక్, మహ్మద్ ఫర్హాన్ ఎంపికైనట్లు పాఠశాల ప్రతినిధులు చెప్పారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, శిక్షకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



క్రీడా జ్యోతిని అందజేస్తున్న బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సైదులు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, ఉజ్వల భవిష్యత్తుకు దారిచూపుతాయని బీసీ గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి బి.సైదులు అన్నారు. బుధవారం కొండపాకలోని మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ గురుకుల పాఠశాలల క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో మూడు రోజుల పాటు జరిగే క్రీడల్లో విద్యార్థులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్, పరుగుపందెం, చదరంగం పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని తెలిపారు. అంతకుముందు పాఠశాలలో క్రీడా జ్యోతిని వెలిగించి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో బీసీ గురుకుల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిరుపతి, కొండపాక బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ ఉన్నారు.

బాల ప్రతిభ.. భవిష్యత్తుకు నిచ్చెన

చదువులో ఉన్నతంగా రాణించాలంటే కళలు, ఆటలు, ఇతర మంచి వ్యాపకాలు ఎంతో అవసరం. దీన్ని గుర్తించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తుండటంతో ఉత్తమ ప్రతిభ చాటుతూ రాణిస్తున్నారు. ఓవైపు చదువులో ఉత్తమ మార్కులు పొందుతూనే మరో వైపు నృత్యం, క్రీడల్లో ప్రతిభ చాటుతున్న బాలలపై కథనం.

పరుగే ప్రాణం



కొడంగల్: కొడంగల్ గిరిజన గురుకులంలో ఇంటర్ చదువుతున్న ఎం.సుభాష్ క్రీడల్లో పరుగు పోటీల్లో విజయాలు సాధిస్తున్నాడు. పరిగి, కులకచర్ల, హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించిన రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్ అభినందించారు.

ఉత్తమ వికెట్ కీపర్



కొడంగల్: కొడంగల్ గిరిజన గురుకులంలో 8వ తరగతి చదువుతున్న ఆర్.సునీల్ క్రికెట్‌లో విజయాలు సాధిస్తున్నాడు. ఈ నెల 2న వికారాబాద్‌లో అండర్ 14 క్రికెట్ పోటీల్లో ఉత్తమ వికెట్ కీపర్‌గా సునీల్ బంగారు పతకం సాధించాడు. రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఇక్కడే 7వ తరగతి చదువుతున్న సాగర్.. ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా రాణించి బంగారు పతకానికి అర్హుడయ్యాడు. ఫైనల్‌లో 29 బంతుల్లో 42 పరుగులు తీశాడు.

ఇటు చదువు.. అటు క్రీడలు



జహీరాబాద్: జహీరాబాద్ మండలం హోతి (కె) శివారులో గల తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నందిని రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడల పోటీలకు ఎంపికైంది. అమ్మానాన్న కవిత, గోపాల్, శిక్షకులు సరిత, నాగయ్య ప్రోత్సాహంతో చదువు, క్రీడను సమన్వయం చేసుకుంటూ, రాణిస్తోంది. రోజూ తెల్లవారుజామునే లేచి వ్యాయామం, ఆట సాధన చేస్తుంది. స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ అండర్-17 విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

క్యూబింగ్‌లో పతకం



తాండూరు: తాండూరుకు చెందిన కందుకూరి చైత్ర రాష్ట్ర స్థాయిలో ఎస్ఎఫ్ఎ సంస్థ నిర్వహించిన రూబిక్స్ స్పీడ్ క్యూబింగ్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. అండర్-14 బాలికల విభాగంలో గచ్చిబౌలిలో పోటీ నిర్వహించగా 41 సెకన్లలో నిర్ణీత లక్ష్యాన్ని పూర్తి చేసింది. తాండూరు నేతాజీ గురుదేవ్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చైత్రను తల్లిదండ్రులు వాణి, రాజ్‌కుమార్ ప్రోత్సహించారు. తాను జాతీయ స్థాయిలో పోటీ పడాలని మెలకువలు నేర్చుకుంటున్నానని చైత్ర చెప్పింది.

ఎన్‌సీసీ వేదికతో గుర్తింపు



గజ్వేల్ గ్రామీణ: చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన అతను చదువుతోపాటు ఆటల్లో, ఎన్‌సీసీలో రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకుంటూ సత్తా చాటుతున్న గజ్వేల్ పట్టణానికి చెందిన దూలం మణికంఠ తల్లి మంగమ్మ టైలరింగ్ పనులు చేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని చదువులో, ఆటలో రాణిస్తున్నాడు. గత మేలో హైదరాబాద్ ఎన్‌సీసీ శిబిరంలో పాల్గొని ప్రతిభ చాటుకోవడంతో అధికారులు జాతీయస్థాయి ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపిక చేశారు. ఈనెల రెండో వారంలో తిరుపతిలో ట్రెక్కింగ్ జరిగింది. మణికంఠ ప్రశంసాపత్రం అందుకున్నాడు. భవిష్యత్తులో ఆర్మీలో చేరాలనేది కోరిక అని బాలుడు చెప్పాడు.

స్మృతీ ఆదర్శం



జోగిపేట: చదువుతో పాటు క్రికెట్‌లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది జోగిపేటకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎ.స్మృతి. ప్రైవేటు బడిలో చదువుతోంది. తల్లిదండ్రులు శ్రీకాంత్, కరుణలు జోగిపేట క్రికెట్ కోచింగ్ కేంద్రంలో సంవత్సరం క్రితం చేర్పించారు. శిక్షకులు సల్మాన్, శివ వద్ద రాటుదేలుతోంది. నిత్యం ఉదయం 5 గంటలకే లేచి తండ్రితో కలిసి సాధన కోసం వెళ్తోంది. సాయంత్రం, సెలవు రోజుల్లోనూ సాధన చేస్తుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో పరిణతి పొందింది.సంగారెడ్డిలో ఎస్‌జీఎఫ్‌లో ప్రతిభ చాటి అండర్-17 పోటీలకు ఎంపికైంది.

రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం



తాండూరు: యాలాల మండలం ముకుంద పూర్‌కు చెందిన అర్చన రాష్ట్ర అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో 2 కి.మీ. పరుగులో ప్రతిభ కనబరిచింది. బంగారు పతకాన్ని సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనుంది. యాలాల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అర్చన.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించే దిశగా సాధన చేస్తోంది.

నర్తిస్తారు.. మెప్పిస్తారు

వికారాబాద్ కలెక్టరేట్: వికారాబాద్ బాల కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థినులు శాస్త్రీయ, సంప్రదాయ పాటలు, భక్తి పాటలు, దేశభక్తి, జానపద పాటలకు అందరూ మెచ్చేలా నృత్యం చేస్తారు. గత నెలలో కాశీ విశ్వనాథస్వామి గుడిలో 'రావణకృత శివతాండవం' నృత్యం చేసి భక్తులను అలరించారు. శ్రేయాన్వి, అనన్య, రష్మిక, పరిణతమాంబ, సౌమ్య, సృజన, వేదశ్రీ, సంహిత, జాహ్నవి, భవిత, శ్రీనిధి పాల్గొన్నట్లు, ఆలయ ట్రస్టు నుంచి ప్రశంసాపత్రం అందుకున్నట్టు బాల కేంద్రం సూపరింటెండెంట్, శిక్షకురాలు టీపీ అనురాధ తెలిపారు. గతంలో హైదరాబాద్, విజయవాడ, చెన్నైలోనూ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు.



కాశీలో నృత్యం చేసిన బాలలు

అబ్బురపరిచే కళ



దుబ్బాక: దుబ్బాక మండలం రామక్కపేట విద్యార్థి బండి క్రాంతికుమార్.. చిన్నతనం నుంచే చిత్రలేఖనం (డ్రాయింగ్)పై మక్కువ పెంచుకున్నాడు. దుబ్బాక పురపాలికలోని లచ్చపేట ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు చంద్రకళ, భూమయ్య బీడీ కార్మికులుగా పని చేస్తూనే కుమారుడిని ప్రోత్సహిస్తున్నారు. పెన్సిల్, స్కెచ్, రంగులతో జాతీయ నాయకులు, దేవుళ్లు, ప్రకృతిని గీస్తూ అబ్బురపరుస్తున్నాడు. వర్గల్‌లో వికసిత్ భారత్‌పై చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చాటాడు. సమగ్రశిక్షా ఆధ్వర్యంలో సిద్దిపేటలో కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. నవంబరులో రాష్ట్రస్థాయిలో పాల్గొననున్నాడు.



శరణ్యతో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్, ఉపాధ్యాయులు

12 కథలు రాసిన బాలిక

హవేలిఘనపూర్: హవేలి ఘనపూర్ మండలం ఔరంగాబాద్‌కు చెందిన చెప్యాల మంజుల-సిద్ధయ్య దంపతుల కుమార్తె శరణ్య. హవేలి ఘనపూర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. బాలసాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీల్లో 'జయహో' కథ బహుమతికి ఎంపికైంది. శరణ్య రెండేళ్ల నుంచి కథలు రాస్తోంది. ఉపాధ్యాయుడు ఉండ్రాళ్ల రాజేశం మెలకువలు నేర్పించారు. బాలిక 12 కథలు రాసింది. గతంలో తెలంగాణ సార్వసత పరిషత్ నుంచి బహుమతి అందుకుంది.



ప్రహర్షిణికి అభినందనలు

క్రమశిక్షణలో ముందు

సిద్దిపేట అర్బన్: నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రహర్షిణి కథల పుస్తకాలు రాస్తూ తెలుగు సాహిత్యంలో రాణిస్తోంది. తల్లిదండ్రులు కారంకంటి కనకయ్య-రజిత. తండ్రి ఆటో నడుపుతున్నారు. తల్లి టైలరింగ్ చేస్తూ ముగ్గురు పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. 6వ తరగతి నుంచి ప్రహర్షిణి ప్రతిభ చాటుతోంది. నేషనల్ మిన్స్ మెరిట్ ఉపకార వేతనానికి ఎంపికైంది. అందమైన చేతిరాత బాలిక సొంతం. రోజూ ఉదయాన్నే 4 గంటలకు నిద్ర లేవడం అలవాటుగా చేసుకుంది. నాలుగు కథలు రాసింది. గతేడాది రాసిన మాంత్రికుని కోటలో చిన్న పిల్లలు కథల పుస్తకానికి రూ.500 బహుమతి అందుకుంది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో ప్రహర్షిణి రాసిన 'సాహసం' కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. నవంబరు 3న హైదరాబాద్‌లో ప్రదానం చేయనున్నారు.

శాకాహారమే శ్రేష్ఠమైంది

ధ్యాన కేంద్రంలో సూచనలు

నర్సాపూర్, న్యూస్‌టుడే: మాంసాహారం తినడం రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలను శాకాహారం వైపు మళ్లించడానికి కొన్ని సంస్థలు ప్రయత్నం చేస్తున్నాయి. మనిషిలో పలు రోగాలకు కారణం మాంసాహారమేనని, శ్రేష్ఠమైన ఆహారం అంటే శాకాహారమేనని వారు చాటిచెబుతున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఇటీవల పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. గతంలో సెలవుదినాలు, పండగలు, ఎవరైనా చుట్టాలు వచ్చినప్పుడు మాత్రమే మాంసాహారాన్ని తీసుకునేవారు. ప్రస్తుతం కూరగాయలు, పప్పు దినుసులతో వంట చేసుకొని భోజనం తగ్గిపోయింది. నిత్యం మూడు పూటలా మాంసాహారం ప్రాధాన్యం పెరిగిపోయింది. పిల్లల్లో చదువులపై, పెద్దలకు శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వారు చెబుతున్నారు. నర్సాపూర్ పట్టణంలో ర్యాలీలో నినాదాలు చేస్తూ.. మాంసాహారం వల్ల నష్టాలను వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. మూగజీవులను సంరక్షించండి, అహింసాయుత భూమాతను ఆవిష్కరించడంలో భాగంగా అవగాహన చేపడుతున్నట్టు తెలంగాణ పిరమిడ్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు పేర్కొన్నారు. ధ్యాన కేంద్రంలో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, బుద్ధి వికాసం, ఆత్మ జ్ఞానానికి ధ్యానం అవసరాన్ని బోధిస్తారు.

సాత్వికాహారంతోనే ఆరోగ్యం: రాములుయాదవ్, ధ్యాన కేంద్రం నిర్వాహకుడు

అనారోగ్యం కారణంగా 2011 నుంచి శాకాహారానికి మారాను. ఎంతో చలాకిగా ఉండగలుగుతున్నాను. సాత్వికాహారంతోనే ఆరోగ్యంగా ఉండగలం. ధ్యానం వలన ప్రయోజనాలు ఉన్నాయి.



నర్సాపూర్‌లో శాకాహారంపై ర్యాలీ

పెద్దల జ్ఞాపకం.. పదుగురికి ఉపయుక్తం

పరిగి, మోమిన్‌పేట, న్యూస్‌టుడే:

- మోమిన్‌పేటకు చెందిన మల్లేశం ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఉన్నట్టుండి స్పృహ కోల్పోయారు. ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు గంట నుంచి ఆటో కోసం కుటుంబ సభ్యుల వెదికారు. విషయం తెలిసిన అల్లుడు ఉచిత సేవలు అందిస్తున్న ఆటోను వినియోగించుకొని సకాలంలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.
- మోమిన్‌పేటకు చెందిన పల్లవి గర్భవతి. పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. ఊరిలోనే ఆసుపత్రి ఉన్నా దూరం కావడంతో ఆటోవాలాలు ఎవరూ రాలేదు. ఉచిత వాహనం సద్వినియోగమైంది.
- మల్లమ్మ తన కూతురు వద్దకు వెళ్లేందుకు ఇంటి నుంచి బస్టాండుకు బయల్దేరారు. మార్గమధ్యలో కాళ్లనొప్పులతో కూర్చున్నారు. ఓ మహిళ ఇచ్చిన సమాచారంతో ఆమెను బస్టాండులో ఉచిత వాహనంలో వదిలారు.



ఎలక్ట్రిక్ వాహనం ఇదే

పదుగురికి మేలు చేయాలన్న ఓ యువకుడి ఆలోచన ఆచరణలోకి వచ్చి వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో ఉపయోగపడుతోంది. ఒక్కోసారి ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఆటోవాలాలు, ఇతర వాహనదారులు డిమాండు చేసి డబ్బు తీసుకొని వాహనంలో తీసుకెళ్తారు. ఉచిత ప్రయాణంతో యువకుడు ఆదర్శంగా నిలుస్తున్నారు. మోమిన్‌పేటకు చెందిన మహంతిరెడ్డిగారి విష్ణు తమ తల్లిదండ్రులు మహంతి రెడ్డి, స్వప్నల పేరిట వృద్ధులు, గర్భిణులు, కాలినడకన వెళ్లే విద్యార్థుల కోసం ఉచిత ప్రయాణం అందించాలని భావించారు. ఇదే విషయాన్ని అన్న లక్ష్మీకాంత్‌రెడ్డి, సోదరి సుష్మారెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో అంగీకరించారు. రూ.6లక్షలు వెచ్చించి పర్యావరణానికి మేలు కలిగించే ఎలక్ట్రిక్ వాహనాన్ని బెంగళూరు నుంచి కొనుగోలు చేసి తెప్పించారు. గ్రామం చివరి నుంచి బస్టాండు వరకు రెండు కిలోమీటర్ల దూరం ఉండటంతో ఇది ఉపయోగపడుతోందని చెబుతున్నారు. ఈనెల 5న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనాథశ్రమంలో ఉంటూ బడికి వెళ్తున్న విద్యార్థులను ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచిత వాహనంలో తరలిస్తున్నారు.

బడికి తీసుకెళ్లే బస్సే బలిగొంది

సహాయకుడు లేకపోవడంతో చిన్నారిని ఢీకొట్టిన డ్రైవర్



చిన్నారి అశ్విని

ఘటనాస్థలంలో విలపిస్తున్న బంధువులు

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: నిత్యం టాటా చెబుతూ చిరునవ్వుతో బడికి వెళ్లే ఆ చిన్నారి ఆనందాన్ని చూసి విధికి కన్నుకుట్టిందేమో.. ప్రతి రోజూ పాఠశాలకు తీసుకెళ్లే బస్సే బాలిక పాలిట మృత్యుశకటంగా మారి బలి తీసుకుంది. క్షేమంగా తిరిగి వస్తుందనుకున్న తమ కూతురు తిరిగి రాని లోకాలకు వెళ్లిందన్న సమాచారం తెలుసుకుని కన్నవారు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పెద్దశంకరంపేట మండలం మక్తలక్ష్మాపురం గ్రామం వద్ద ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొని విద్యార్థిని దుర్మరణం చెందిన ఘటన బుధవారం జరిగింది. సీఐ రేణుక తెలిపిన ప్రకారం మక్తలక్ష్మాపురం గ్రామానికి చెందిన బోయిని చంద్రమోహన్, సరితలకు ఇద్దరు కుమార్తెలు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమార్తె అశ్విని (6) పెద్దశంకరంపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాల బస్సులోనే బడికి వెళ్లి, సాయంత్రం తిరిగి వచ్చింది. రోడ్డు దాటుతుండగా డ్రైవర్ చూసుకోకుండా బస్సును ముందుకు పోనివ్వడంతో అశ్వినిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో డ్రైవర్ పరారయ్యాడు. బస్సులోని విద్యార్థులు భయంతో ఇళ్లకు పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్, పాఠశాల యాజమాన్యం గ్రామానికి వచ్చే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని బంధువులు, గ్రామస్థులు రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసుల జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో విరమించారు. మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి దుర్మరణం



మహమూద్ మియా

పాపన్నపేట, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన ఘటన పాపన్నపేట శివారులో బుధవారం జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం యూసుఫ్‌పేటకు చెందిన మహమూద్ మియా (65) స్థానిక తపాలా కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందారు. బుధవారం మధ్యాహ్నం స్కూటీపై పాపన్నపేటకు కూరగాయల కొనుగోలుకు వస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వాహనం ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మహమూద్ మియాకు భార్య కౌసర్ సుల్తానా, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మూడు రోజుల కిందట చిన్న కుమార్తె నిశ్చితార్థం జరిగింది. అంతలోనే ఇలా జరగడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

ఎదురెదురుగా బైకులు ఢీకొని ఎలక్ట్రీషియన్..



బాలకృష్ణ

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దుంపల నాగమణి, విఠల్ కుమారుడైన బాలకృష్ణ (21) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. మానెపల్లి గ్రామానికి జంగల్ల భూమేశ్‌తో కలిసి వెళ్తున్నారు. మానెపల్లి నుంచి ఎదురుగా వస్తున్న తల్లీకుమారులు పెంటయ్య, నర్సమ్మల వాహనం ఢీకొంది. ప్రమాదంలో కింద పడిన బాలకృష్ణ తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. నర్సమ్మకు గాయాలు కావడంతో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణ తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



రాజిరెడ్డి

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మండలం కూచనపల్లికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి(55) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు. అక్కన్నపేట మండలంలో నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టులో గుడాటిపల్లి గ్రామం ముంపునకు గురైంది. దీనితో రాజిరెడ్డి కూచనపల్లిలో ఇల్లు నిర్మించుకున్నాడు. అతిగా మద్యం తాగడంతో ఆరోగ్యం చెడిపోయింది. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. ఈ నెల 22న తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్దూరు మండలంలో మరో యువకుడు..



రాజు

చేర్యాల(మద్దూరు), న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు గ్రామ రైతు కుటుంబానికి చెందిన పూల మల్లేశం- బూదమ్మ ఏకైక కుమారుడైన రాజు(22) బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. డిగ్రీ వరకు చదివిన రాజు కొన్నాళ్ల క్రితం వరకు స్థానిక పాల ఉత్పత్తిదారుల కేంద్రంలో పని చేశాడు. వ్యవసాయంలో తల్లిదండ్రులకు సాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పొలంలో తీసిన పత్తి విక్రయించిన అనంతరం సాయంత్రం తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కడుపులో నొప్పి వేస్తోందని తన మిత్రుడికి చెప్పడంతో వెంటనే లద్నూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు జనగామ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. అతని ఆత్మహత్యకు కారణం తెలియలేదు. ఈ ఘటనపై మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్‌ను అడుగగా ఆత్మహత్య సమాచారం ఉంది కానీ దానిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామన్నారు.



లెక్కిస్తున్న సిబ్బంది, సేవాసమితి సభ్యులు

వనదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.39.91 లక్షలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి హుండీల ద్వారా రూ. 39,91,361 ఆదాయం సమకూరింది. దీనికి అదనంగా బంగారం, వెండి ఆభరణాల కానుకలొచ్చాయి. ఈవో చంద్రశేఖర్, హుండీ లెక్కింపు ఇన్‌ఛార్జి సుధాకర్‌రెడ్డి సమక్షంలో ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు గోకుల్‌షెడ్‌లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. 83 రోజుల్లో ఆ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

ఆధునిక పరికరం.. ప్రమాదాల నివారణం

న్యూస్‌టుడే, జిన్నారం:

పరిశ్రమల్లో చిన్న లోపం ఉన్నా ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే వ్యాపారులకు తెలిసేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తోంది. దీనివల్ల పరిశ్రమల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఉత్పత్తి ప్రాసెస్‌లో తేడా ఉంటే వ్యాపారులు వస్తువులను కొనరు. ఉత్పత్తి విషయంలోనైనా ప్రమాదాల నివారణకైనా ఆధునిక సాంకేతిక పరికరాల ద్వారా అప్రమత్తం అవుతున్నారు. పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కర్మాగారాల భద్రతా శాఖ యాజమాన్యాలను అప్రమత్తం చేస్తోంది.



రియాక్టర్ వద్ద ఆటోమేటిక్ యంత్రం

రియాక్టర్లు, రసాయనాల నిల్వ ప్రాంతాలు కీలకం

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం ఉంటుంది. యూనిట్లలో ఎక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటాయో అక్కడే దృష్టి సారిస్తున్నాయి యాజమాన్యాలు. రియాక్టర్, సెంటర్ ఫీజ్, బాయిలర్, చిల్లింగ్ పాయింట్, రసాయనాల నిల్వ ప్రాంతాల్లో పరికరాలు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రమాదాన్ని గుర్తించి వాటంతట అవే నివారిస్తాయి. కార్మికులకు చిన్న పాటి ప్రమాదం జరిగితే అత్యవసర కంటి శుభ్ర షవర్‌లను ఏర్పాటు చేసుకున్నారు.

కార్మికులకు చైతన్యం

పరిశ్రమల్లో పని చేసే ప్రతి కార్మికుడిని చైతన్యం చేసే చర్యలు ప్రతి పరిశ్రమలో కనిపిస్తాయి. మాక్‌డ్రిల్ ద్వారా కార్మికుల అప్రమత్తతను పరీక్షిస్తారు. నెలకు ఓసారి మాక్ డ్రిల్ ఉంటుంది. పరిశ్రమల గోడలపై కార్మికులు, ప్రతినిధుల అవగాహనకు చిత్రాలు వేస్తారు. అవి చాలా తోడ్పడతాయని ఎస్ఎంఎస్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ టీఎస్ఎం శేఖర్ చెప్పారు. కార్మికులకు భద్రత పోటీలు నిర్వహిస్తారు. చైతన్యం కలిగిస్తారు. ఉత్పత్తులకు ఆర్డర్లు ఇచ్చే వివిధ దేశాల ప్రతినిధులు సైతం కార్మికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను ఆరా తీస్తారు.

అప్రమత్తతే ఆయుధం

– పీవీ నాయుడు, పరిశ్రమ భద్రతా విభాగ అధికారి



పరిశ్రమల్లో పని చేసే ప్రతి కార్మికుడు అప్రమత్తంగా ఉండాలి. యాజమాన్యాలు ప్రత్యేక శిక్షణ ఇవ్వటంతో పాటు అందుబాటులోకి వచ్చిన పరికరాలను సమకూర్చుకుంటాయి. అన్ని రకాల రసాయన పరిశ్రమల్లో ఈ విధానం కనిపిస్తుంది.

మార్పులతోనే మార్కెట్‌ను ఎదుర్కోగలం

– నాగేశ్వరరావు, పరిశ్రమల విభాగం ఎండీ, ఐడీఏ బొల్లారం



ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యాజమాన్యాలు మార్చుకుంటున్నాయి. అప్పుడే నేటి మార్కెట్‌ను ఎదుర్కోగలమని గ్రహించారు. ఆధునిక పరికరాలు సమకూర్చుకుంటున్నాయి.

'కాగ్నిజెంట్'లో గురుకుల విద్యార్థులు

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ మహాత్మా జ్యోతిబా ఫులే వెనుకబడిన తరగతుల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థినులు బుధవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని కాగ్నిజెంట్ సంస్థను సందర్శించారు. విద్యాలయం నుంచి వెళ్లిన 15 మంది విద్యార్థినులతో విదేశాలకు చెందిన సంస్థ ప్రతినిధులు మమేకమై పలు అంశాలపై అవగాహన కల్పించారు.

సమీకృత మార్కెట్ సందర్శన

గజ్వేల్, న్యూస్‌టుడే: గజ్వేల్ సమీకృత మార్కెట్‌ను సూర్యాపేట జిల్లా మార్కెటింగ్, పురపాలక శాఖ అధికారులు బుధవారంసందర్శించారు. డీఎంఓ సంతోష్ కుమార్, డీఈ సత్యనారాయణ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు మార్కెట్లో కలియతిరిగి రైతులు, వ్యాపారులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో జరుగుతున్న లావాదేవీల గురించి కార్యదర్శి జాన్ వెస్లీ వారికి వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

సిర్గాపూర్ మండల ప్రత్యేకాధికారిగా వెంకటేశ్వర్లు

సిర్గాపూర్, న్యూస్‌టుడే: మండల ప్రత్యేకాధికారిగా డీఈవో వెంకటేశ్వర్లును నియమిస్తూ కలెక్టర్ వల్లూరి క్రాంతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించి పారిశుద్ధ్యం, తాగునీరు, ఉపాధి హామీ, బీసీ కులగణన, తదితర అంశాలపై చర్చించారు. ఎంపీడీవో మల్సూర్ నాయక్, ఎంఈవో శంకర్ పాల్గొన్నారు.

సురక్షిత నీరు అందించండి

న్యాల్‌కల్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు రక్షిత మంచి నీటి ట్యాంకుల ద్వారా సురక్షిత నీటిని అందించాలని నీటి పారుదల శాఖ అధికారి అంగత్‌కుమార్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో చేతిపంపుల నిర్వహణ, మరమ్మతులు, నీటి నాణ్యత పరిశీలించే విధానంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజశేఖర్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు పత్రాల అందజేత

మునిపల్లి, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభు కోరారు. బుధవారం బుదేరా ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి పత్రాలు అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మునిపల్లి: మునిపల్లి రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 182 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను రాయికోడ్ ఏఎంసీ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ ఆశా జ్యోతి అందజేశారు. నాయకులు సతీష్ కుమార్, రసూల్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలని ధర్నా

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఉపకార వేతనాలు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశానికి వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో నాయకులు ఇసాక్, అశోక్, ప్రసాద్, లింగం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె దారులకు మహర్దశ



కంది మండలం చిమ్నాపూర్ రహదారి

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి గ్రామీణ, సదాశివపేట, జోగిపేట, కంది: చినుకు పడితే పల్లెదారులు చిత్తడిగా మారుతుంటాయి. వర్షకాలమొస్తే చాలు నడవలేని పరిస్థితి ఎదురవుతోంది. అలాంటి దారులను తారుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. జాతీయ గ్రామీణ హామీ పథకం కింద పల్లె, గిరిజన తండాల్లోని రహదారుల బలోపేతానికి నిర్ణయం తీసుకుంది. ఇటీవలే నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పీఆర్ శాఖ ఆయా పనులకు త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపట్టడానికి కార్యాచరణ సిద్ధం చేస్తుంది.

రూ.80.93 కోట్ల నిధుల కేటాయింపు

ఎక్కడెక్కడంటే..

- సంగారెడ్డి మండలం ఫసల్‌వాది తండాకు వయా మహ్మద్ షాపూర్ తండాకు రోడ్డు లేదు. వర్షమొస్తే గిరిజనులు పంట పొలాలకు, సంగారెడ్డికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతుంటారు.
- సదాశివపేట వయా అలియాబాద్, గారకుర్తి రహదారి అధ్వానంగా మారింది. ఏళ్ల నాటిది కావడంతో కంకర తేలి గుంతలు పడ్డాయి.
- కంది మండలం చిమ్నాపూర్ తండాకు, మక్త అల్లూరు నుంచి కలివేముల గ్రామాల మీదుగా వెళ్లడానికి మట్టి దారులే దిక్కు. వర్షకాలమొస్తే రైతులు తమ పంట ఉత్పత్తులు తరలించేందుకు నానా తంటాలు పడతారు.
- అందోల్ మండలం కిచ్చన్నపల్లి రోడ్డుపై పదేళ్ల క్రితం తారు వేశారు. ప్రస్తుతం కంకర లేచి గుంతలు పడ్డాయి. ఇక్కడ్నుంచే కిచ్చన్నపల్లిలోని ఉత్తర తిరుపతిగా పేరు గాంచిన వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా వెళ్తారు.
- అందోల్ మండలం డాకూర్ నుంచి మాసానిపల్లి మీదుగా సంగుపేటకు వెళ్లే ప్రధాన మార్గం దెబ్బతిన్నది. రోళ్లపహాడ్, దానంపల్లి గ్రామాల దారులు సైతం అలాగే ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల పలు మండలాల్లోని గ్రామాల్లో రహదారులకు పీఆర్ నుంచి నిధులు మంజూరు చేశారు. ఆయా పనులు పూర్తయితే ప్రయాణ కష్టాలు తీరుతాయి.

నియోజకవర్గాల వారీగా...

నియోజకవర్గం	రహదారులు	కిలోమీటర్లు	నిధుల అంచనా (రూ.లక్షల్లో)
సంగారెడ్డి	4	14.20	1499
పటాన్‌చెరు	12	16.00	2086
జహీరాబాద్	2	4.85	500
అందోల్	13	34.32	2508
నారాయణఖేడ్	7	1911	1500

త్వరలో టెండర్లు పిలుస్తాం



జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ రహదారులకు ఇటీవల నిధులు మంజూరయ్యాయి. ఆయా పనులకు జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకుంటాం. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

–జగదీశ్వర్, పీఆర్ ఈఈ, సంగారెడ్డి.

మౌలిక సదుపాయాలు కల్పించండి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు అపర్ణపాటిల్, ఉపాధ్యక్షుడు చింతాగోపాల్, కళాశాల ప్రిన్సిపల్ రత్న ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సులువుగా అర్థమయ్యేలా బోధన

మనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధన చేయడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు సంగమేశ్వర్ బోధిస్తున్న పాఠాలను విద్యార్థులతో కలిసి విన్నారు. అనంతరం మనూరు మండలం పుల్‌కుర్తిలోని కస్తూర్బాగాంధీ పాఠశాల, నాగల్‌గిద్ద ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు.

వృద్ధులకు ఉచిత న్యాయ సేవలు

సంగారెడ్డి అర్బన్: ఎలాంటి ఆదరణ లేని వృద్ధులకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని సంగారెడ్డి గ్రేస్ వయో వృద్ధాశ్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వృద్ధులు టోల్‌ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఫౌండేషన్ ప్రతినిధులు

ఖాజీపల్లి (జిన్నారం), న్యూస్‌టుడే: ఖాజీపల్లి పంచాయతీ పరిధి 181 జీఎంఆర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి ఆర్‌కే ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఈ మేరకు ఫౌండేషన్ ఛైర్మన్, న్యాయవాది రమాకాంత్ ఆధ్వర్యంలో బుధవారం జీఎంఆర్ కాలనీకి వెళ్లే రోడ్డుపై గుంతలు పూడ్చే పనులు ప్రారంభించారు. బస్ షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. నిధులు భరిస్తానని వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుమ్మడిదల, న్యూస్‌టుడే: బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన1998-99 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు బుధవారం గుమ్మడిదలలోని ఓ వేడుక మందిరంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువును సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు.

యాదాద్రిలో టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ పూజలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి బుధవారం సందర్శించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాగతం పలికిన పండితులు, పూజారులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు దేవుడి ప్రసాదం అందజేశారు.

ఏబీసీ కేంద్రానికి శునకాల తరలింపు

ఐడీఏ బొల్లారం(జిన్నారం): ఐడీఏ బొల్లారం పట్టణంలో ఇటీవల శునకాలు అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో పురపాలిక సంఘం నివారణ చర్యలు చేపట్టింది. ఛైర్‌పర్సన్ కె.రోజారాణి, కమిషనర్ మంగతాయారు ఆదేశాలతో పట్టణ పరిధిలోని 3, 4, 15, 16 వార్డుల పరిధిలోని శునకాలను పట్టి ఏబీసీ కేంద్రానికి తరలించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కౌన్సిలర్లు చంద్రారెడ్డి, నిహారికారెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, సంతోష పాల్గొన్నారు.

ఏబీవీపీ మండల కన్వీనర్‌గా సాయికృష్ణ

వట్‌పల్లి, న్యూస్‌టుడే: ఏబీవీపీ మండల కన్వీనర్‌గా సాయికృష్ణ నియమితులైనట్లు భాజపా అందోలు శాసనసభ నియోజకవర్గ కన్వీనర్ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బిల్లు చెల్లించలేదని వంటగదికి తాళం

నారాయణఖేడ్: కంగ్టి మండలం దెగుల్‌వాడీ ప్రాథమిక పాఠశాలలో వంటగది నిర్మించి ఏడాది దాటినా బిల్లు చెల్లించలేదని బుధవారం మాజీ సర్పంచి చంద్రవ్వ తాళం వేశారు. హెచ్‌ఎం రేఖారాణి నచ్చజెప్పినా తాళం తీయలేదు. దీంతో వంట చేసేందుకు వచ్చిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు నిరీక్షించి వెనుదిరిగారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలని నిరసన

జహీరాబాద్ అర్బన్: ఏఈవోలపై ప్రభుత్వం విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్ కుమార్ డిమాండు చేశారు. డివిజన్ విస్తరణాధికారులతో కలిసి బుధవారం హైదరాబాద్‌లోని డైరెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. రైతు బీమా వివరాలునమోదు చేయలేదని కారణం చూపడం సరికాదన్నారు.

పాఠశాలలో హాజరు పరిశీలన

ఝరాసంగం: కొల్లూర్ గ్రామాన్ని ఎంపీడీవో సుధాకర్ బుధవారం సందర్శించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన దస్త్రాలను పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

మునిపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన మునిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మధురిమను ఘనంగా సత్కరించారు. బుధవారం మునిపల్లి పాఠశాల ఆవరణలో గంధం సరస్వతీ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్ఞాపిక అందజేశారు. ఎంఈవో భీమ్‌సింగ్, మల్లికార్జున్, హెచ్‌ఎం మాధవి పాల్గొన్నారు.

మెట్లు ఎక్కేదెలా..



కోహీర్ మండలం మద్రి గ్రామంలో ఇనుప చువ్వలను మాత్రమే అంటిపెట్టుకుని ఉన్న నీటిట్యాంకు మెట్లు ఎప్పుడు కింద పడతాయో తెలియని పరిస్థితి. ట్యాంకు చుట్టుపక్కల, సమీపంలో చిన్నారులు ఆటలాడుతూ తిరుగుతుంటారు. మెట్లు ఏ క్షణమైనా కింద పడే పరిస్థితి నెలకొంది. దీనిని శుభ్రం చేయడానికి ఎక్కేందుకు సైతం అవకాశం లేకుండా పోయింది. ఇకనైనా మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మమత మాట్లాడుతూ... ట్యాంకును పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

బకాయి డీఏలు చెల్లించాలి

వట్‌పల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు బకాయి డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాజర్ పటేల్ డిమాండ్ చేశారు. ఖాదీరాబాద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన టీపీటీఎఫ్ అందోలు, వట్‌పల్లి మండలాల కమిటీల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఐదు డీఏలను చెల్లించలేదన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌భాస్కర్, ప్రధాన కార్యదర్శి రాంచందర్ పాల్గొన్నారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మండల మహాసభ నిర్వహించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సైమన్, ఉపాధ్యక్షులుగా కమలాకర్‌రావు, వీణాధరి, కోశాధికారిగా షకీల్, కార్యదర్శులుగా సుచరిత, సంధ్యారాణి, బస్వరాజ్, నాగలక్ష్మి, శ్రీలత, గంగయ్య, స్వామి, ప్రహ్లాద్, అపర్ణ, సూర్యనారాయణశర్మ ఎన్నికయ్యారు.

రూ.10 నాణేలు వినియోగించండి

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వ్యాపారులు, ప్రజలు పది రూపాయల నాణేలు వినియోగించాలని ఆర్‌బీఐ రీజినల్ మేనేజర్ సుజాత, ఏపీజీవీబీ చీఫ్ మేనేజర్ ప్రకాశం కోరారు. పది రూపాయల నాణేలకు సంబంధించి కరపత్రాలను బుధవారం వ్యాపారులకు పంచి అవగాహన కల్పించారు. అపోహలు సరికాదని పేర్కొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ

సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి గ్రామీణం: మిడ్వాన్ సంస్థ వినతితో ప్రమతి సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో రూ.75 లక్షలతో నిర్మించనున్న నాలుగు అదనపు గదుల నిర్మాణానికి మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం భూమి పూజ చేశారు. ప్రమతి లిమిటెడ్ సీఈవో విజయ్, మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, భూమి దాతలు సాగర్, చక్రపాణి, మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



జోగిపేటలో పనులు ప్రారంభించిన ఛైర్మన్ మల్లయ్య

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఒకటో వార్డులో పురపాలక ఛైర్మన్ గూడెం మల్లయ్య వార్డు కౌన్సిలర్ డాకూరి శివశంకర్‌తో కలిసి రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారుల పనులకు బుధవారం భూమి పూజ చేశారు. కమిషనర్ తిరుపతి, సురేందర్‌గౌడ్, ఏఈ శ్రీకాంత్, అందోలు పీఏసీఎస్ ఛైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ మండలం అనెగుంటలో సీసీ రోడ్డు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. పీఎంజీఎస్‌వై పథకంలో రూ.1.31 కోట్లతో తారు రోడ్డు చేపట్టిన గుత్తేదారు మధ్యలో వదిలేశారు. ఎమ్మెల్యే మాణిక్ రావు ఇటీవల దిశ సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తేవడంతో పనులు మళ్లీ మొదలయ్యాయి. భారాస నాయకులు నారాయణ పాల్గొన్నారు.

నేరడిగుంటలో గ్రామసభ

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్, అందోలు ఎంపీడీవో మనోజ్ బుధవారం నేరడిగుంట పంచాయతీలో ఉపాధిహామీ గ్రామ సభ నిర్వహించారు. వచ్చే ఏడాది వరకు ఈజీఎస్ పథకం కింద చేపట్టే పనులు గురించి వివరించారు. పథకంలో పలు పనులపై అవగాహన కల్పించారు. ఎంపీవో అశోక్, ఏపీవో అర్చన, రాజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నిజాంపేట బంద్

నారాయణఖేడ్: హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ గురువారం నిజాంపేట బంద్‌ను నిర్వహించనున్నట్లు హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి బాధ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల వారు బంద్‌కు సహకరించాలని కోరారు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం



సురేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి

గురుజువాడ(కోహీర్), న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు మరువలేనివని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కోహీర్ మండలం గురుజువాడకు చెందిన అమరుడు జంగంగారి సురేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. సురేష్ కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందజేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అమరుల కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట ఎస్సై గోపతి సతీష్ ఉన్నారు.

జహీరాబాద్ అర్బన్: పోలీసు ఆంక్షలు అతిక్రమించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం సీఐ శివలింగంతో కలిసి మాట్లాడారు. అనుమతి లేకుండా ర్యాలీలు, ప్రదర్శనలు, సభలు సమావేశాలు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఆరుద్ర నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలోని కేతకి సంగమేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్ర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శివలింగానికి ఫలాభిషేకం, అన్నాభిషేకం, భస్మాభిషేకం చేశారు. పండ్లతో శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

నేడు మాతాశిశు మరణాలపై అవగాహన సదస్సు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి(ఎంసీహెచ్)లో నేడు మాతా శిశు మరణాల తగ్గింపుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నామని ఆ ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ జి.అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల ఆరోగ్య సమస్యలపై వైద్య నిపుణులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

బోనస్ ప్రకటించాలని కార్మికుల నిరసన



కంపెనీ ఎదుట ధర్నా చేసున్న కార్మికులు

పుల్కల్, న్యూస్‌టుడే: ఎనిమిదేళ్లుగా కంపెనీలో పని చేస్తున్నా ఒక్కసారి కూడా బోనస్ ప్రకటించలేదని యస్.ఇటిక్యాల ఎంఎస్ ఇండస్ట్రీస్ ఎదుట కార్మికులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కంపెనీలో సుమారు 250కి పైగా మహిళా కార్మికులు, 100 మంది పురుషులు పని చేస్తున్నట్లు తెలిపారు. మేడే, పంద్రాగస్టు, పండుగల సెలవులకు వేతనం ఇవ్వడం లేదని ఆరోపించారు. పని చేస్తున్న సమయంలో పెద్ద గాయాలు అయినా ఆసుపత్రి ఖర్చులు భరించడం లేదంటూ వాపోయారు. లేబర్ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ కార్మికులతో మాట్లాడుతూ.. రూ.1500 బోనస్ ఇస్తామని చెబితే కార్మికులు ఆగ్రహించారు. ఈ విషయమై కంపెనీ ప్రతినిధులను విలేకరులు వివరణ కోరగా... ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదాలు జరగలేదని, ఒకవేళ జరిగితే తమ కార్లలో ఆసుపత్రికి తీసుకెళ్తామని చెప్పడం విశేషం.

దుకాణాల కేటాయింపు సమావేశం వాయిదా



లబ్ధిదారులతో మట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్, న్యూస్‌టుడే: జహీరాబాద్ సమీకృత మార్కెట్‌లో దుకాణాలు పొందిన వ్యాపారులతో బుధవారం పురపాలక కార్యాలయంలో నిర్వహించిన సమావేశం నిలిచిపోయింది. దుకాణాల విషయంపై చర్చించేందుకు వేలం పాటల్లో దుకాణాలు పొందిన వ్యాపారులు, సెల్లులార్‌లో కూరగాయల స్టాళ్ల కేటాయింపుపై కూరగాయల వ్యాపారులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. వ్యాపారులు పెద్దఎత్తున తరలివచ్చారు. కలెక్టర్, ఆర్డీవో కార్యక్రమం చివరి నిమిషంలో రద్దు కావడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. దీంతో వ్యాపారులు అసంతృప్తికి లోనయ్యారు.

ముందస్తు చర్యలతో క్యాన్సర్ నివారణ

జోగిపేట, న్యూస్‌టుడే: క్యాన్సర్ అని భయపడొద్దని ప్రముఖ గైనకాలజిస్టు వైద్యురాలు శైలజ అన్నారు. ముందస్తుగా గుర్తిస్తే వ్యాధిని నయం చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. బుధవారం అందోలు ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. క్యాన్సర్‌లో రకాలు, నివారణ పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రిన్సిపల్ వాణి, జగన్మోహన్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, శ్రీకాంత్, అనంత్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాంపెక్స్‌లో కుదిరిన వేతన ఒప్పందం

ఐడీఏ బొల్లారం(జిన్నారం), న్యూస్‌టుడే: ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని రాంపెక్స్ పరిశ్రమలో వేతన ఒప్పదం కుదిరిందని రాష్ట్ర కార్మిక నాయకుడు వి.వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్మిక శాఖ అధికారి రవీందర్ సమక్షంలో ఒప్పందం జరిగిందన్నారు. దీంతో ఒక్కో కార్మికుడికి రూ.9,100 ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను కార్మికులకు రవీందర్ అందించగా నాయకులు, కార్మికులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. పరిశ్రమ ఉన్నతాధికారులు శాస్త్రి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

మునిపల్లి: బుసారెడ్డిపల్లి శివారులోని సింగూర్ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లిన సదాశివపేట మండలం మాలపాడు గ్రామానికి చెందిన దుర్గయ్య(51) నీట మునిగి బుధవారం మృతి చెందినట్లు మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించామన్నారు.

పస్తాపూర్ కూడలి.. సమస్యల లోగిలి



జాతీయ రహదారిపై పస్తాపూర్ కూడలి



రోడ్డు పక్కనే ప్రమాదకర గుంత

న్యూస్‌టుడే–జహీరాబాద్: జహీరాబాద్ శివారులో నిత్యం రద్దీగా ఉంటే పస్తాపూర్ కూడలి సమస్యలకు నిలయంగా మారింది. రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నా సమస్యలు అదేస్థాయిలో ఉంటున్నాయి. అధికారులు దృష్టి సారిస్తేనే పరిష్కారం అవుతాయి.

పస్తాపూర్ కూడలి గతంలో పంచాయతీ పరిధిలో ఉండేది. పురపాలక సంఘంలో వీలీనం కావడం, పరిసరాల్లో కొత్త కాలనీలు వెలుస్తుండటంతో పట్టణంలోనే ప్రధాన కూడలిగా రూపుదిద్దుకుంది. రహదారికి ఇరువైపులా పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, హోటళ్లు ఏర్పాటు కావడంతో నిత్యం ఉదయం నుంచి చీకటి పడే వరకు రద్దీగా ఉంటుంది. దీనికి తోడు హైదరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, నిజామాబాద్, జోగిపేట వైపు గల వివిధ గ్రామాలను కలిపే రహదారులు కావడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇక్కడే బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల కోసం వేచి ఉంటారు.

ఎండకు ఎండుతూ..

ప్రధాన కూడలిలో కనీసం బస్సు షెల్టర్ లేక ప్రజలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్డుపక్కనే వేచి ఉంటున్నారు. శౌచాలయాలు లేక ప్రజలు ముఖ్యంగా మహిళలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. జాతీయ రహదారి నుంచి ఝరాసంగం వెళ్లే ప్రధాన కూడలి వద్ద పెద్ద గుంత ఉండటంతో అదుపు తప్పి వాహనదారులు, ప్రజలు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. చిరువ్యాపారులు రోడ్లను ఆక్రమించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. వీధి దీపాలు వెలగక రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పరిష్కారానికి చర్యలు

పస్తాపూర్ కూడలిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. రహదారులకు ఇరువైపులా చిరు వ్యాపారాలను గతంలో ఓసారి తొలగించాం. దీనికి తోడు కూడలి వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకుండా అడ్డుగా ఉన్న బోర్డులు, డబ్బాలు, తోపుడు బండ్లను కూడా తీయించాం. కూడలిని సుందరికరించి కనీస సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు పంపించాం. –శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ జహీరాబాద్ పురపాలక సంఘం.